క్లుప్తంగా

రేషన్ డీలర్ ఎంపికకు రాత పరీక్ష



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

మధిర: ఖాళీగా ఉన్న రామచంద్రాపురం గ్రామంలోని రేషన్ షాపు డీలర్ ఎంపిక కోసం మధిర తహసీల్‌లో ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించారు. ఒక రేషన్ డీలర్ కోసం 8 మంది దరఖాస్తు చేసుకోగా అందరూ పరీక్షకు హాజరయ్యారు. తహసీల్దార్ రాజేష్ పర్యవేక్షణలో ఈ పరీక్ష జరిగింది.

సుధారాణికి ఉత్తమ మహిళా అవార్డు



అవార్డు అందుకుంటున్న సుధారాణి

సత్తుపల్లి: పట్టణానికి చెందిన ఆయుర్వేద వైద్యురాలు, సుధా ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ కొనకళ్ల సుధారాణికి అంతర్జాతీయ ఉత్తమ మహిళా అవార్డు, కళా నిలయం సంస్థ ఉగాది నంది పురస్కారాలను దక్కాయి. ఈమేరకు హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆమెకు విశ్వరూపిణి సంస్థ, శ్రీకళా నిలయం బాధ్యులు అవార్డు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బీ.బీ.పాటిల్, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల పాదయాత్ర



పాదయాత్రగా బయలుదేరిన క్రైస్తవులు

సత్తుపల్లిరూరల్: క్రైస్తవులు ప్రతీ సంవత్సరం గుడ్‌ఫ్రైడేకి ముందు 40 రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టి పవిత్రమైన ఉపవాస దీక్షలు పాటిస్తారు. అందులో భాగంగా సత్తుపల్లిలోని కార్మెల్‌మాత చర్చ్(ఆర్‌సీఎం) ఫాదర్ అనీల్ సారథ్యంలో ఆదివారం సంఘస్తులు పెద్ద ఎత్తున సత్తుపల్లి నుంచి ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన పశ్చిమగోదావరి జిల్లా అల్లిపల్లిలోని మరియ తల్లి దేవాలయానికి పాదయాత్రగా వెళ్లారు. సత్తుపల్లి చర్చ్‌నుంచి ఉదయం ఆరుగంటలకు ప్రారంభమైన ఈ యాత్రలో క్రైస్తవ సోదరులు దేవుని గీతాలను ఆలపిస్తూ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని చుట్టు పక్క గ్రామాల నుంచి క్రైస్తవులు పాల్గొన్నారు. 25 కిలోమీటర్ల పాటు కొనసాగిన ఈ పరిశుద్ధ పాదయాత్రలో కార్మెల్ మాత చర్చ్ సహాయక గురువులు ఫాదర్ ప్రదీప్, జ్యోతినిలయం కన్యస్త్రీలు, సంఘపెద్దలు ఆనంద్, ప్రకాష్, ఇన్నయ్య, సురేష్, రాజేంద్ర పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి పలు గ్రామాల లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క కృషితో బాధిత లబ్ధిదారులకు రూ.1.67 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బండారు నర్సింహారావు, కడియం శ్రీనివాసరావు, నాగిరెడ్డి, బాబురావు, శ్రీను, జానీబాషా తదితరులు ఉన్నారు.

కుర్చీలు వితరణ



కుర్చీలను అందజేస్తున్న ఏసురత్నం

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలోని తెలుగు బాపిస్టు చర్చికి ఆదివారం స్థానిక భక్తుడు, భద్రాద్రి కొత్తగూడెం డీఈఓ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ పగిడిపల్లి ఏసురత్నం 20 కుర్చీలను అందించారు. ఈ సందర్భంగా దాత ఏసురత్నాన్ని చర్చి ఫాదర్ ఎస్.చిట్టిబాబు ఆశీర్వదించి ప్రార్థన చేశారు. కార్యక్రమంలో దేవరకొండ భూషణం, రోశయ్య తదితరులున్నారు.

ఎప్పుడు కూలుతుందో..?

శిథిలావస్థలో వెంగన్నపేట లెవల్ వంతెన
- బ్రిడ్జి నిర్మించింది 37 ఏళ్లు
- సైడ్ పిల్లర్లు లేక ప్రమాదకరంగా వంతెన
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



సైడ్ పిలర్లు లేకుండా ప్రమాదకరంగా ఉన్న వంతెన



శిథిలావస్థలో ఉన్న కల్లూరు వాగు వంతెన



వంతెన వద్ద దెబ్బతిన్న ఆర్అండ్‌బీ రోడ్డు

తల్లాడ: మండలంలోని వెంగన్నపేట – మిట్టపల్లి గ్రామాల మధ్య నిర్మించిన కల్లూరువాగు వంతెన ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఈ వంతెన నిర్మించి 37 ఏళ్లు అవుతున్నా మరమ్మతులకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీనిని 1985లో అప్పటి నీటిపారుదల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ వంతెనపై నుంచి ఆరుగ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. గతేడాది వచ్చిన తుపాన్ తాకిడికి, వర్షాలకు వంతెన కింద రాళ్లు కొట్టుకుపోయి.. వంతెన పూర్తిగా దెబ్బతిన్నది. దానికి తోడు ఈ ఏడాది కురిసిన వర్షాలకు వంతెన మరింత దెబ్బతింది. రివిట్‌మెంట్ కూడా కొట్టుకుపోయి.. ఆర్అండ్‌బీ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనాలు, ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ వంతెనపై ప్రయాణం సాగించే వెంగన్నపేట, మిట్టపల్లి, నూతనకల్, ముచ్చగూడూరు, వెంకట్రామునితండా, రామచంద్రాపురం గ్రామాల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం ఈ బ్రిడ్జిని ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించి మరమ్మతులు చేయాలని ప్రతిపాదనలు పంపినా ఇంత వరకు నిధులు మంజూరు కాలేదు. దీంతో ఇది ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు.

వంతెన వద్ద గుంతల మయం..

కల్లూరు వాగు వంతెనపై వేసిన ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా ధ్వసమైంది. రోడ్డుపై గుంతలు ఏర్పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. వెంగన్నపేట, మిట్టపల్లి వెళ్లేవైపు రోడ్డు దెబ్బతిని కంకర రాళ్లుపైకి తేలాయి. దీంతో వాహనదారులు ఇక్కడ జారి పడుతున్నారు. రాత్రి వేళ్లలో గుంటల కనిపించక మరిన్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పలువురు గాయపడిన సంఘటనలు చాలానే ఉన్నాయి. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం వెంకన్నపాలెం సర్పంచ్ ఏడుకొండలు ఆ గుంటల్లో మట్టి తోలించినా ఆగకపోవడంతో.. మరళ మొరం తోలించాడు. అయినా మళ్లీ గుంటలు ఏర్పడ్డాయి. కావున అధికారులు రోడ్డును బాగుచేయించి ప్రయాణికులను, గ్రామప్రజలను ఆదుకోవాలని కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి..



వెంగన్నపేట – మిట్టపల్లి గ్రామాల మధ్య ఉన్న కల్లూరు వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలి. వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో రాక పోకలకు అంతరాయం కల్గుతుంది. వంతన వద్దకు వచ్చేసరికి భయపడాల్సి వస్తోంది. రాత్రి పూట గుంటలు కనిపించక ప్రమాదాల భారీన పడుతున్నారు.

– కోదూరి శ్రీనివాసరావు, వెంగన్నపేట

నిధులు మంజూరు చేయాలి..



కల్లూరు వాగుపై హై లెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. ఈ వంతెన ఎప్పుడు కూలుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో పలు గ్రామాల ప్రజలు వంతెన వద్ద ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోంది.

– బండారు ఏడుకొండలు, సర్పంచ్, వెంగన్నపేట

కాంగ్రెస్ పాలన రావాలి..



మాట్లాడుతున్న మాజీ మంత్రి సంభాని

కల్లూరు రూరల్: పేదల బతుకులు మారాలంటే కాంగ్రెస్ పాలన రావాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని ముచ్చవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 9ఏళ్ల పాలనలో ప్రజలకు ఎటువంటి ప్రయోజనంలేదన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రియెంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, పంట రుణ మాఫీ లాంటి ఎన్నో పథకాలు అమలు చేసిందన్నారు. ఈ సారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఈ పథకాలన్నీ మళ్లీ అమలౌతాయన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీని ఆదరించాలన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ కాంగ్రెస్ డిక్లరేషన్ పత్రాలను అందించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, దారా రంగ, శీలం జమలయ్య, రాములు, పెద్ద దర్గయ్య, గోసుదర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

రచన పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కవులు

మధిర: మధిర పట్టణానికి చెందిన ప్రముఖ కవి రామిశెట్టి రోశయ్య కలం నుంచి జాలువారిన రచన పుస్తకాలను ఆదివారం స్థానిక వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఆవిష్కరించారు. విద్యావేత్త ప్రముఖ కవి మువ్వా శ్రీనివాసరావు చేతుల మీదుగా రోశయ్య రచించిన పాత చెప్పులకు పాలిష్, ఇక సాగవు.. సాగవు, నూతన వెలుగులు, ఇల్లూరి మాస్టారు, ధిక్కార స్వరాలు అనే రచన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైజాం నవాబుల కాలం నుంచి నేటి పరిస్థితుల వరకు రోశయ్య రచించిన పుస్తకాల్లో విపులంగా సామాజిక స్పృహతో కూడిన అనేక చారిత్రక అంశాలు ఉన్నాయన్నారు. ఖమ్మం కవిరత్నం హెచ్‌వీఎల్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. కవులు, కళాకారులు మధిర, ఎర్రుపాలెం ప్రాంతాల నుంచి అనేకమంది ఉద్భవించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అట్లూరి వెంకటరమణ, వనం వెంకట వరప్రసాదరావు, హరి శంకర శర్మ, శ్రీమన్నారాయణ, యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరరావు కుటుంబానికి ఎంపీ పరామర్శ

కారేపల్లి: అనారోగ్యం కారణంగా మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన నర్సింగ్ ఉమామహేశ్వరరావు మృతదేహం వద్ద ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శనివారం రాత్రి నివాళులర్పించారు. ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించడంతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో శెట్టి రంగారావు, ఆకుల గాంధీ, పగడాల మంజుల, ఉంగరాల సుధాకర్, ఆకుతోట ఆదినారాయణ, శేఖర్, శ్రీకాంత్, సీహెచ్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయాబాయి పర్యటన..

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరురాలు విజయాబాయి కారేపల్లి మండలంలో ఆదివారం పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. మండలంలోని ఉసిరికాయలపల్లి, పోలంపల్లి, భాగ్యనగర్, కారేపల్లి గ్రామాల్లో ఆమె పర్యటించారు. సర్పంచ్ ఆదెర్ల స్రవంతి, ఎంపీటీసీ ఇమ్మడి రమాదేవి, నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మల్లేల నాగేశ్వరరావు, ఎండీ.హనీఫ్, శ్రీను, మాన్‌సింగ్, గుంపిడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడలో అ'పూర్వ' సమ్మేళనం



అలనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

తల్లాడ: తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1988–89 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా కలిసి తాము చదువుకున్న పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థులంతా సమావేశమయ్యారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకొని 34ఏళ్ల కిందటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులు హైమావతి, నరసింహారావు, సుధాకర్‌దాసు, రామారావు, కాంతారెడ్డిలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి అనుభవాలను విద్యార్థులతో పంచుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు తోటి మిత్రులతో ఆనందంగా గడిపారు. తల్లాడ ఎంఈఓ, ప్రస్తుత హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.దామోదరప్రసాద్‌ను సన్మానించారు. అనంతరం అందరూ కలిసి భోజనాలు చేశారు. తల్లాడ జిల్లా పరిషత్ పాఠశాలకు తమ వంతు సహాయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే తమతో పాటు చదువుకొని మృతి చెందిన తమ బ్యాచ్ విద్యార్థులకు, నాడు చదువు చెప్పి దూరమైన గురువులను స్మరించుకుంటూ సంతాపం పాటించారు. అనంతరం సభలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

30న మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్

ఎర్రుపాలెం: మండలంలోని వెంకటాపురం గ్రామంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఈ నెల 30న మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆదివారం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.700లతో ఈ నెల 28వ తేది కల్లా బి.సాయికుమార్ 95425 13119, బి.అరవింద్ 97097 85568 నంబర్లకు పంపించాలని కోరారు. పోటీల్లో గెలపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.20,016, రూ.15,016, రూ.10,016ల నగదు అందజేస్తామని తెలిపారు.

ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక



ఆలయ కమిటీ చైర్మన్ రంజిత్ కుమార్

కల్లూరు: మండలంలోని హనుమాతండా పంచాయతీ పరిధిలోని గనియాతండా అభయాంజనేయస్వామి నూతన ఆలయ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా బానోత్ రంజిత్ కుమార్, వైస్ చైర్మన్‌గా భూక్యా రాము, కార్యదర్శిగా గుగులోత్ శంకర్, కమిటీ సభ్యులుగా బానోత్ చిన్న నరసింహా, గుగులోత్ రమేష్, బానోత్ మోహన్, గుగులోత్ కోటి, బానోత్ సతీష్, బానోత్ క్రాంతికుమార్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బానోత్ లక్ష్మానాయక్, భూక్యా హరిసింగ్, భూక్యా శివ కుమార్, బానోత్ రాజు, భూక్యా మంగితియ, బానోత్ పుల్‌సింగ్, బాలాజి పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిఫ్ మండల అధ్యక్షుడిగా ప్రవీణ్



జి.ప్రవీణ్

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన జి.ప్రవీణ్ కుమార్ పాస్టర్స్ ఫెలోషిఫ్ మండలాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన మండల కమిటీ సమావేశంలో అధ్యక్షుడిగా ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా హనోక్, కార్యదర్శిగా ఏసురత్నం, జాయింట్ సెక్రటరీగా అబ్రహంతో పాటు మరో 8 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు ఆదెమ్మ మృతి

మధిర: రాయపట్నం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు ఆదెమ్మ (90) ఆదివారం మృతి చెందారు. మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆమె మృతదేహాన్ని టీడీపీ మధిర నియోజకవర్గం కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు సందర్శించి నివాళులు అర్పించారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది..



కల్లూరురూరల్: బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

కల్లూరు రూరల్: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. మండలంలోని ముగ్గు వెంకటాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ముల్లంగి ముత్తారావు ఇటీవల ఒక ప్రమాదంలో మృతిచెందాడు. ఆయనకు పార్టీ సభ్యత్వం ఉండటంతో 2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఆదివారం ఎమ్మెల్యే మృతుని భార్యకు అందించారు. అనంతరం లక్ష్మీపురం, కొత్తబోడిమల్ల గ్రామాల్లో సంవత్సరాల తరబడి సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇప్పిస్తానన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాసరెడ్డిని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ కె.విజయరావు, ఎంపీపీ బీరవెల్లి రఘు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి కె.ప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరావు, రైతు కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు, సహకార బ్యాంకు డైరెక్టర్ లక్ష్మణ్‌రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ యువజన సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, కె.ప్రసాద్, కిరణ్, జమలయ్య, నాగిరెడ్డి, శ్రీరంగం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం..

కల్లూరు: కల్లూరులో లిటిల్ ఫ్లవర్ చర్చిలో ఆదివారం మెగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రారంభించారు. రూ. 50 వేల విలువైన రిథమ్ పరికరాన్ని చర్చికి బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ.. సంకల్ప స్వచ్ఛంద సంస్థ తలసేమియా వ్యాధిగ్రస్థుల కోసం రక్తాన్ని సేకరించడం గొప్ప విషయమన్నారు. వైద్య శిబిరంలో పలు ఆస్పత్రుల డాక్టర్లు అనుశ్రీ, సురేష్‌బాబు, రమేష్, ఏకేవీ రామన్, ఆరీఫ్, ఆస్మాలు వైద్యసేవలు అందించి అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో కొత్తగూడెం ప్రావిన్షియల్ సుపీరియర్ రెవ.ఫాదర్ జయరాజు, లిటిల్ ఫ్లవర్ చర్చి ఫాదర్ రెవ.విన్సెంట్, మేనేజింగ్ డైరెక్టర్ ఫాదర్ లూర్దు, విచారణ సహాయ గురువులు రెవ.ఫాదర్ దేవదానం, స్త్రైజర్ ఫార్మసీ నిర్వాహకులు నరేష్, సీఐ హనూక్, తహసీల్దార్ జె.బాబ్జీప్రసాద్, బీఆర్ఎస్ మండల నాయకులు పాలెపు రామారావు, సొసైటీ చైర్మన్ లక్ష్మణరావు, రైతు సమితి మండల కన్వీనర్ డాక్టర్ రఘు, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, మేకల కృష్ణ, వెంకటరత్నం, ప్రసాద్, కిరణ్, నాగేశ్వరరావు, యనమాల రవీంద్ర, కోట కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ..

వేంసూరు: మండలంలోని పలు కుటుంబాలను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పరమర్శించారు. దుద్దెపూడిలో ఇటీవల అనారోగ్యం బారినపడ్డ జక్కంపూడి శ్రీనివాస్, చీపు సత్యనారాయణ, తెల్లబోయిన వెంకన్న సతిమణిని పరామర్శించారు. వెంకటపురంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పర్స వెంకటేశ్వరరావును పరమర్శించారు. అనంతరం భీరపల్లి మందపాటి వెంకటరెడ్డి మనువడు పంచల వేడుకలో పాల్గొన్నారు.

ధర్మబిక్షం జీవితం.. ఆదర్శం



ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బోనకల్: స్వతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ధర్మబిక్షం పోరాటాలు స్పూర్తిదాయకమని గీతపనివారల సంఘం రాష్ట్ర నాయకుడు బందం నాగేశ్వరరావు గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో బొమ్మగాని ధర్మబిక్షం 12వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో అనేకమంది సామాన్యులకు శిక్షణ ఇచ్చిన మహానేత ధర్మబిక్షం అని అన్నారు. గీత కార్మికుల శ్రేయస్సు కోసం పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు జక్కా నాగభూషణం, నాగేశ్వరరావు, నరసింహారావు, రవి, అర్జున్, అమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 14నుంచి సీపీఐ ప్రచార జాతా



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నాయకుడు భాగం హేమంతరావు

వైరా: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14 నుంచి ఖమ్మం జిల్లాలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార జాతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు భాగం హేమంతరావు స్పష్టం చేశారు. వైరాలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రచార జాతా ఖమ్మం జిల్లాలోని 21 మండలాల్లో కొనసాగుతుందని, దేశంలో ఫాసిస్టు పరిపాలన సాగిస్తున్న బీజేపీకి వ్యతిరేఖంగా ఏప్రిల్ 14నుంచి దేశవ్యాప్తంగా బీజేపీకు హఠావో.. దేశ్ బచావో నినాదంతో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలోనూ బీజేపీని అధికారంలోకి రాకుండా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రాష్ట్ర శాసనసభకు వచ్చే ఎన్నికల్లో సీపీఐ ఖమ్మం జిల్లా నుంచి ప్రాతినిధ్యం సంపాదించేందుకు పార్టీ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా జరిగే పోరాటానికి లౌకిక ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకం కావాలన్నారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కమ్యూనిస్టు ఒట్లతో ఎమ్మెల్యేగా గెలిచిన కందాల ఉపేందర్‌రెడ్డి నేడు వారిపైనే అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. కమ్యూనిస్టులను విమర్శించిన కందాల భేషరత్తుగా క్షమాపణ చెప్పాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు యర్రా బాబు, దొండపాటి రమేష్, యమాల గోపాలరావు, రంజిత్, వేముకొండ రమేష్, భరత్, రాఘవరావు, అశోక్ పాల్గొన్నారు.

అంకమ్మ ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ముదిగొండ: మండలంలోని కమలాపురం శ్రీ అంకమ్మ దేవాలయంలో నూతనంగా పునఃప్రతిష్ఠించిన అమ్మవార్ల విగ్రహాల వద్ద ఆదివారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. నూతన గోపురాలతో పాటు అంకమ్మ, మద్దిరావమ్మ, నాగేంద్ర స్వామి, శ్రీమహాలక్ష్మి, పెద్దమ్మతల్లి విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవం జరిగి 16రోజులు సందర్భంగా గ్రామంలో ఊరంతా బోనాలతో ఊరేగింపుగా అమ్మవార్లకు సమర్పించారు. ఈ నెల 6నుంచి పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించి హోమాలు, వివిధ పూజలు చేపట్టారు. మండలంలోని పలు గ్రామాలనుంచి తరలి వచ్చిన భక్తులు పూజలు చేసి బోనాలు సమర్పించారు.

సత్యనారాయణ స్వామి భక్తుల పాదయాత్ర

వైరారూరల్: మండలంలోని దాచాపురం గ్రామానికి పలువురు సత్యనారాయణ స్వామి భక్తులు ఆదివారం ఉదయం పాదయాత్రగా అన్నవరంలోని సత్యనారాయణ స్వామి సన్నిధికి వెళ్లారు. స్వామి సన్నిధికి చేరిన అనంతరం మొక్కులు చెల్లించకున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో అయిలూరి శ్రీనివాసరెడ్డి, గుడూరు వెంకటరామిరెడ్డి, కృష్ణారెడ్డి, చెన్నారెడ్డి, వెంకట్రామకృష్ణారెడ్డి, పల్లెబోయిన కృష్ణయ్య, మదర్ సాహెబ్, నరాల కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు నివాళి

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు బండి నాగేశ్వరరావు (55) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు సామినేని రామారావు, మండల కార్యదర్శి గోపాలరావు, నాయకులు పాపయ్య, వెంకటనర్సయ్య, రవి, గోపాలరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

పెద్దమ్మా.. చల్లంగ చూడమ్మా..



పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

సత్తుపల్లిటౌన్: పెద్దమ్మా.. చల్లంగ చూడమ్మా అంటూ బక్తులు అమ్మవారిని వేడుకున్నారు. మండలంలోని అయ్యగారిపేటలోని నాయకపోడు గిరిజనుల ఆరాధ్యదైవం పెద్దమ్మతల్లి తిరునాళ్లు ముగిసాయి. తెల్లవారుజామున మైలపట్నం, జలాభిషేకం, బోణాలతో మహిళల ఊరేగింపు, మేళతాళాలు.. జయజయ ధ్వానాలు.. గణాచారుల పూనకాల నడుమ నిప్పుల గుండం తొక్కుతూ పెద్దమ్మతల్లిని గద్దెనెక్కించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల మండలాల నుంచి పెద్దెత్తున నాయకపోడు గిరిజనులు తరిలివాచ్చారు. ఈ సందర్భంగా కోళ్లు, మేకలు, బోణాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ మట్టా రాగమయి, సొసైటీ అధ్యక్షుడు చల్లగుండ్ల కృష్ణయ్య, కౌన్సిలర్ మేకల భవాని, నర్సింహారావు, కాశిన రాజులు, పుచ్చా వెంకటేశ్వరరావు, పుల్లారావు, శ్రీను, కృష్ణ, సత్యనారాయణ, మరికంటి శ్రీను, మారుతి బాబురావు, ఎండి కమల్‌పాషా పాల్గొన్నారు.